అంతర సేద్యంతో అధిక లాభాలు

- లోదుక్కులతో నేల కోత దూరం
- సస్యరక్షణతో మంచి దిగుబడి
- ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి


ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి

తలుపుల : మామిడిలో అంతర సేద్యంతో లాభాల పంట పండించవచ్చు. సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాల్సి ఉంటుంది. లోతుగా దుక్కులు చేయడం వల్ల నేలకోతను అరికట్టవచ్చు. దుక్కి చేయడం వల్ల నీరు వృథాగా పోకుండా ఎక్కడి నీరు అక్కడే ఇంకుతుంది. మామిడి తోటల్లో కోతల సమయం పూర్తయింది. అంతర సేద్యం, సస్య రక్షణ చర్యలు చేపడితే కాయల నాణ్యత, దిగుబడి బాగుంటుందని ఉద్యాన శాఖ అధికారి ఎస్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...


మామిడి తోట

లోతుగా దుక్కులు చేసుకోవాలి

తోటల్లో చెట్టుకు చెట్టుకు మధ్య లోతుగా దుక్కులు చేయాలి. అలా చేయడం వలన నేల స్వభావం గుల్లబారి పూర్తిగా మారిపోతుంది. జూలై ఆఖరులో తొలుత, ఆగస్టులో రెండవసారి, అక్టోబర్, నవంబర్ నెలల్లో మూడవసారి దుక్కులు చేసుకోవాలి. మొదటి దుక్కి లోతుగా దున్నడంతో నీరు భూమిలోకి ఇంకి నేల కోతను అరికడుతుంది. దీంతో గాలి బాగా ప్రసరించి, చెట్లు ఆరోగ్యంగా ఉంటాయి. అంతర సేద్యం వలన కలుపు నివారించవచ్చు. నేలలో నివసించే కీటకాలు, పురుగులు చనిపోతాయి. వేరు కుళ్లు ఎక్కువగా ఆశించదు.

మొక్కలు నాటే ప్రక్రియ ఇలా చేపట్టాలి

అధిక శాతం తోటల్లో సరైన పద్ధతులు పాటించక, మొక్కలు పెంచక, సక్రమమైన యాజమాన్య పద్ధతులు అనుసరించకపోవడంతో చెట్లు చనిపోతున్నాయి. దానివలన అధిక శాతం తోటల్లో ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఈ ఖాళీల్లో మొక్కలు నాటేటప్పుడు ఒక మీటరు పొడువు, అర మీటరు వెడల్పు, అర మీటరు లోతు గుంత తవ్వాలి. గుంతలో పై అరమీటరు మట్టిని ఓ వైపు, మరో అరమీటరు మట్టిని మరోవైపు, ఆ తరువాత తీసిన మట్టిని మరో వైపు వేసి, ఆ తరువాత తీసే మట్టిని ఇంకో వైపు వేసి. తతిమా అర మీటరు మట్టిని పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి వేయాలి.

భూమికి మీటరు ఎత్తులో ఉండాలి

చెట్టు భూమిపై నుంచి మీటరు ఎత్తు వరకు కొమ్మలు కత్తిరింపు చేయాలి. ఉత్తర, దక్షిణ, వైపు చెట్టుకు కొమ్మలు కింది భాగాన లేకుండా కత్తిరించాలి. వెలుతురు తగిలేలా గుబురు కొమ్మలు లేకుండా చూడాలి. సూర్యరశ్మి తగలకపోతే చీడ పీడలు వస్తాయి. కొమ్మలు కత్తిరించడం వలన సూర్యరశ్మి తగలడంతో పాటు గాలి, వెలుతురు వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

ఎరువుల వాడకం.. యాజమాన్య పద్ధతులు

ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను సకాలంలో అందించాలి. ఎంత మోతాదులో వేసుకోవాలో తెలుసుకోవాలి. ఏడాది పైబడిన 10 ఏళ్లలోపు చెట్లకు పేడ ఎరువు 5 నుంచి 10 కిలోలు, 10 ఏళ్ల పైబడిన చెట్లకు 25 కిలోల పేడ ఎరువు, 1 కిలో యూరియా, 1 కిలో పొటాష్, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్, జింక్ సల్ఫేట్ 200 నుంచి 250 గ్రాములు, బోరాన్ 50 నుంచి 100 గ్రాములు వేయాలి. వేసిన తరువాత నీటి తడిని ఇవ్వాలి. సాళ్ల మధ్యలో జనుము, జీలగ వేసి, పూత దశలో కల్టివేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వలన పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది.

మొదళ్లలో చెదల నివారణ

చెదల నివారణకు 100 గ్రాములు మిలాథియన్, ఎండో సల్ఫాన్, పొడిమందును, పశువుల ఎరువును బాగా కలపాలి. ఈ మిశ్రమం పూడ్చాలి. తక్కువ వస్తే పక్కన మట్టిని తీసుకొని పూడ్చాలి. మొక్కను నాటే సమయంలో రోజూ గుంతకు నీరు నింపితే కుది పడుతుంది. ఆ గుంతలో చెట్టుకున్న ప్లాస్టిక్ కవర్ తొలగించి ముద్ద ఎంత మాత్రం వుంటే అంత గుంత తవ్వి పూడ్చాలి. వాటి అంటు భూమిలో లేకుండా చూడాలి. చెట్టు అటు ఇటు కదలకుండా కర్ర పాతి పురితో కట్టాలి. చెట్టు మొదళ్లలో అయితే క్లోరోఫైరిపాస్ 2.50 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. చెట్లకు కిలో మైలతుత్తం, కిలో సున్నం, పుట్టమన్ను 5 లీటర్ల నీటిలో కలిపి చెట్టు మొదలు 3 అడుగుల ఎత్తు వరకు పూయాలి.

క్లుప్తంగా

సెస్సు బకాయిలపై ఆరా


రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి రమ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పంచాయతీల నుంచి వసూలు చేసే పన్నులో గ్రంథాలయానికి రావాల్సిన 8 శాతం సెస్సు బకాయిల గురించి ఎంపీడీఓ, ఈఓఆర్డీలను సంప్రదించి చర్చించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మూడే బొజ్జే నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు


పోట్లమర్రిలో గణేశునికి ఆకుపూజ

బత్తలపల్లి: మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, సంఘమేశ్వరక్షేత్రం తదితర గ్రామాల ఆలయాల్లో మంగళవారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని వినాయకునికి అభిషేకాలు, అర్చనలతో పాటు ఆకుపూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

రూ.3,85 లక్షలు పలికిన వారపు సంత

తలుపుల : మండల కేంద్రం తలుపులలో వారపు సంతం వేలపాటను డీఎల్‌పీఓ ఆంజినప్ప ఆధ్వర్యంలో మంగళవారం ఈఓ అబ్దుల్ మునాఫ్ నిర్వహించారు. 12 మంది వేలం పాటలో పాల్గొన్నారు. చెదలవాండ్లపల్లికి చెందిన రాజబాబు రూ.3,85 లక్షలకు వేలం పాట దక్కించుకొన్నారు. కార్యక్రమంలో టోపీ రమణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు


గ్రామస్తులకు వైద్య చికిత్సలు అందిస్తున్న సిబ్బంది

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవల్లో భాగంగా మంగళవారం రామాపురంలో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, జబ్బు పడిన వారికి, బీపీ, షుగర్, రక్తం, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, కోడిగుడ్లు, మాంసం, చేపలు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాయికీర్తన, ఏఎన్ఎం సుగుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా వేమన్న

తనకల్లు: సీఐటీయూ తనకల్లు మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఒంటెద్దు వేమన్న, కో కన్వీనర్‌గా నరసింహారెడ్డితో పాటు మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్, మండల కార్యదర్శి శివన్న, నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం


ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రతినిధితో ఒప్పందం చేసుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ స్మిత

కదిరి అర్బన్: ఎస్కేయూనివర్సిటీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ నీతి ఆయోగ్ సహకారంతో కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్నొవేషన్ కౌన్సిల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకమైన ఆలోచనలకు ఒక రూపం కల్పించేందుకు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల ఆలోచనలను ఒక స్టార్టప్స్‌గాను ఇంక్యుబేషన్ సెంటర్‌ను స్వంతంగా నిర్వహించుకునేందుకు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహాయపడుతుందన్నారు. ఈ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఎస్టీఎస్ఎన్ ఇన్నొవేషన్ కౌన్సిల్ నిర్వహించడానికి కావాల్సిన సబ్ స్క్రిప్షన్ కోసం తాను రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల కెరీర్‌ను స్థిరపరచడానికి ఈ ఇంక్యుబేషన్ సెంటర్ చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు హైదరార్ అలీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులతో భోజన నాణ్యత గురించి తెలుసుకుంటున్న ఎంఈఓ ప్రసన్నకుమార్‌నాయుడు

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ-2 ప్రసన్నకుమార్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. హరియాన్ చెరువు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. నిర్ణీత సమయానికి అందరూ పాఠశాలకు తప్పక హాజరు కావాలన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. భోజనం రుచికరంగా ఉంటుందా లేదా కావాల్సినంత ఇస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మద్యం స్వాధీనం

గాండ్లపెంట: కటారుపల్లి గొల్లపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడి చేశారు. మహబూబ్‌ఖాన్ వద్ద నుంచి 8 మద్యం (క్వార్టర్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐతో పాటు హెచ్‌సీ తిరుమలరెడ్డి, సిబ్బంది భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చెన్నేకొత్తపల్లి: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడాపురం యునాని వైద్యశాల అధికారి డాక్టర్ ఖాదర్ సూచించారు. మేడాపురం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తొట్టెల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయరాదన్నారు. ఇలా చేయడం వలన దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తచెరువు: వేరుశనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొడపగానిపల్లి, తిరుమలదేవరపల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నటరాజ్, కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

తనకల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 27న సెబ్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు సెబ్ ఎస్ఐ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలో వాహనాలను దక్కించుకున్నవారు అదనంగా జీఎస్టీ చెల్లించాలని తెలిపారు. వేలం పాట గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, మరింత సమాచారం కోసం పరాకవాండ్లపల్లిలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో సీట్లు భర్తీ చేయండి

పుట్టపర్తి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్లు వెంటనే భర్తీ చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు కేటాయించి, చదువు కొనసాగించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకుల పాఠశాలల్లో టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మల్లికార్జుననాయక్ హెచ్చరించారు.

ఉపాధి పనులపై రేపటి నుంచి గ్రామసభలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో ఉపాధి హామీ పథకం కింద గడిచిన ఏడాది వ్యవధిలో చేపట్టిన పనులపై గురువారం నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే సామాజిక తనిఖీ సిబ్బంది మండలానికి వచ్చారని, ఏడాది నుంచి జరిగిన పనుల వివరాలను ఆధారాలతో వారికి అందజేసినట్లు తెలిపారు. 27వ తేదీ నుంచి జూలై ఒకటో తేదీ వరకు పనులపై ఆయా గ్రామాలలో కూలీలతో సభలు నిర్వహిస్తారన్నారు. రెండో తేదీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న కాలేజీ విద్యార్థులు

ధర్మవరం రూరల్: చేతుల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని, విద్యార్థులు అన్నం తినే ముందు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(చిత్తూరు జిల్లా పి.కొత్తకోట)కు చెందిన కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కింద కళాశాల విద్యార్థులు పూజ, దిలీప్‌కుమార్, సౌమ్య, మనోజ్ భార్గవ్, తేజ కుమార్, అభిలాష్, లోకేష్, పునీత్ మంగళవారం మల్లాకాలువ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్యం, ఆహారపు అలవాట్లు, మొక్కల పెంపకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తీసుకుంటున్న ఆహార పదార్థాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, అనారోగ్య పరిస్థితులు తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కదిరి టౌన్ : పట్టణంలో ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం మీడియాకు వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని అమీన్‌నగర్‌లో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ ఆదేశల మేరకు ఎస్ఐ బాబ్జాన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఆరుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.9,220 స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

నల్లమాడ: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ సందర్శించి, వీఆర్వోలు, ఇతర సిబ్బందికి విధి నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే రైతులు, విద్యార్థులు, ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని, మ్యూటేషన్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల మంజూరులో కాలయాపన చేయకుండా మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే జాతీయ రహదారికి భూముల సేకరణ, పరిహారం మంజూరు తదితర వివరాలను తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.


సంకష్టహర చతుర్థి పూజలకు హాజరైన భక్తులు

వైభవంగా సంకష్టహర చతుర్థి

కదిరి టౌన్: పట్టణంలోని ఉమమాహేశ్వరి ఆలయంలో మంగళవారం రాత్రి సంకష్టహర చతుర్థి వైభవంగా నిర్వహించారు. గణపతికి పంచామృత అభిషేకం, గరిక పూజ, సంకష్టహర చతుర్థి వ్రత కథ తదితర జరిగాయి. గణపతికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా మహిళలు ఉపవాసంతో వచ్చి పూజ అనంతరం వారు చంద్రుని చూశారు. ఉపవాసం ఉండి పూజ చేస్తే కష్టాలు తీరుతాయనేది భక్తుల నమ్మకం.

ప్రత్యేక అలంకరణలో గణపతిస్వామి →



జనాలపై దోమల దండయాత్ర


పెడబల్లి రోడ్డులో పేరుకున్న చెత్త

ఎన్పీకుంట: ఇంటా బయటా దోమలే... రాత్రీ పగలు అనే తేడా లేకుండా అవి జనాలపై దండయాత్ర చేస్తున్నాయి. మండల కేంద్రంలోని పలు వీధుల్లో పారిశుధ్యం లోపించింది. ఇళ్ల ముందు చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. సాయంత్రం ఐదు గంటలు దాటితే చాలు ప్రజలపై దోమలు తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు లోతట్టుకు చేరుతోంది. వర్షాలు కురుస్తుండటంతో రోడ్ల పక్కన, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. అధికారులు స్పందించి వీధుల్లో చెత్తాచెదారం తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.